క్లుప్తంగా

ఆరబోసిన ధాన్యాన్నే తీసుకురావాలి : ఏఓ



రైతులతో మాట్లాడుతున్న ఏఓ రాంప్రసాద్

టేక్మాల్(మెదక్): పూర్తిగా ఆరబోసిన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని వ్యవసాయాధికారి రాంప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలోని షాబాద్ తండా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తేమశాతం 17 లోపు ఉండాలని, తాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. సన్న రకం వరి ధాన్యాన్ని పరీక్షలు నిర్వహించి ప్రభుత్వం అందించే రూ.500 ల బోనస్ అందిస్తామని సూచించారు. గ్రామాల్లోని రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం నిర్వహించే కొనుగోలు కేంద్రాలను మాత్రమే సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని రకాల వసతులు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు.

నీట్‌లో ర్యాంకు.. నేచురోపతిలో సీటు



లక్ష్మీప్రసన్న

వెల్దుర్తి(తూప్రాన్): పట్టణానికి చెందిన మెదక్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణాగౌడ్ కూతురు లక్ష్మీప్రసన్న నీట్ ఫలితాల్లో రాష్ట్రంలో 12,459వ ర్యాంక్ సాధించింది. మెడికల్ విభాగంలో వెబ్ ఆప్షన్ పెట్టుకోగా గాంధీ నేచురోపతి మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. గ్రామీణ ప్రాంతంలో విద్యనభ్యసించి మెడికల్ సీటు సాధించిన యువతిని ఈ సందర్భంగా పలువురు అభినందించారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానానికి చేరుకొని నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే సునీతారెడ్డి మంగళవారం నర్సాపూర్‌లో ఎల్‌ఓసీ, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందచేశారు. వెల్దుర్తి మండలం చెర్లపల్లి గ్రామానికి చెందిన ప్రవళికకు రూ. 2లక్షల ఎల్‌ఓసీ అందజేశారు. దీంతోపాటు సోమక్కపేట గ్రామానికి చెందిన నిర్మలకు రూ. 42వేలు, చండూర్ గ్రామానికి చెందిన పోచయ్యకు రూ.27వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందించారు. కార్యక్రమంలో సత్యంగౌడ్, ప్రసాద్‌గౌడ్, జగపతి, జగన్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ ఆర్డీఓగా మహిపాల్



మహిపాల్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన మైహిపాల్‌ను ఆర్డీఓ కార్యాలయం సిబ్బంది సన్మానించారు. ఇక్కడ పనిచేసిన ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి బదిలీపై కందుకూరుకు వెళ్లారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి



కౌడిపల్లిలో ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కౌడిపల్లి(నర్సాపూర్): పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కలీముల్లకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఈ సందర్భంగా మండల పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ.. పంచాయతీ నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు త్వరగా విడుదల చేయాలన్నారు. క్రీడా కోటాలో ఎంపికైన వారిని తిరిగి విధులలోకి తీసుకోవాలన్నారు. ఉపాధిహామీ సామాజిక తనిఖీలో పంచాయతీ కార్యదర్శులను బాధ్యులను చేయొద్దని తెలిపారు. విధి నిర్వాహణలో మరణించిన వారికి రూ. 50లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్‌రెడ్డి, రాజిరెడ్డి, నరహరి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పేరుకే ‘ఆదర్శం’.. పనులన్నీ నాసిరకం

- అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అన్ని అక్రమాలే.
- పనులు నిర్వహించకుండానే నిధులు స్వాహా
- పనులు మళ్లీ చేయాలని డీపీఓ ఆదేశాలు
- పట్టించుకోని కాంట్రాక్టర్



రాంపూర్ పాఠశాల శ్లాబ్, గోడలకు వేసిన సిమెంట్ పూత



నీలకంఠపల్లి పాఠశాలలోని మూత్రశాలకు నాసిరకం పనులు

అల్లాదుర్గం(మెదక్): పాఠశాలల్లోని మరమ్మతు పనులకు రికార్డులు లేవు, చేసిన పనులు కనిపించవు, నిధులు మాత్రం స్వాహా అయ్యాయి. పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం అమ్మ ఆదర్శ పథకం కింద నిధులు మంజూరు చేస్తే పాత వాటికే, నామమాత్రంగా పనులు చేసి అక్రమాలకు పాల్పడ్డారు. అమ్మ అదర్శ పాఠశాలల అక్రమాలపై సాక్షిలో ఆగస్టు 8న పాత పనులకు కొత్త హంగులు అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ యాదయ్య ఆగస్టు 9న అల్లాదుర్గం మండలంలోని అప్పాజీపల్లి, నీలకంఠపల్లి, ముస్లాపూర్ తండా, అప్పాజీపల్లి తండా పాఠశాలలో పనులను పరిశీలించి విచారణ చేశారు. పాఠశాలల్లో నాణ్యత లేని పనులా, డీపీఓ ఆగ్రహం అనే శీర్షికతో ఆగస్టు 10న సాక్షిలో వార్త ప్రచురితమైంది. పనులు మళ్లీ చేయించాలని పీఆర్ ఏఈకి డీపీఓ ఆదేశించారు. మండలంలో 20 పాఠశాలలను ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేసింది. విద్యుత్, తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్ల మరమ్మతు పనులకు రూ. 60 లక్షలు మంజూరు చేసింది. డీపీఓ యాదయ్య, పాఠశాలలో పనులపై విచారణ చేసి, మూడు నెలలు కావస్తున్నా.. పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. నీలకంఠపల్లి ప్రాథమిక పాఠశాలకు అభివృద్ధి పనులకు ప్రభుత్వం. రూ.5 లక్షల 41 వేలు మంజూరు చేసింది. ఈ పనులను గ్రామ ఐకేపీ సంఘం అధ్యక్షులకు అప్పగించారు. అయితే వారికి బదులు వారి భర్తలు పనులు చేపట్టి అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. పాఠశాల గదిలో బండలు సక్రమంగా వేయలేదు. నీటి సౌకర్యం కోసం సంపు నిర్మించగా, వర్షం పడితే మురికినీరు అందులోకి పోతుందని గ్రామస్తులు చెప్పారు. మూత్రశాలలకు నాసిరకం పనులు చేశారు. పనులు చేపట్టక ముందే అడ్వాన్సుగా కాంట్రాక్టర్ రూ.2 లక్షలు తీసుకున్నారని, మరో రూ. లక్ష 34 వేల చొప్పున రెండు చెక్కులను రికార్డులు కాకుండానే రాయించుకున్నారు. వెంకట్‌రావ్‌పేట ప్రాథమికోన్నత పాఠశాలలో పాత పనులకే కొత్త పూతలు పూసి, నిధులు కాజేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాంపూర్, సీతానగర్, సీతానగర్ తండా, ముప్పారం పాఠశాలల్లో నాణ్యత లేని పనులు చేపట్టినట్లు విమర్శలున్నాయి. పాఠశాలల నిధులపై కలెక్టర్ సమగ్ర దర్యాప్తు చేపట్టి, చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నాణ్యత లేని పనులు



పాఠశాలకు సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తే, నాణ్యత లేకుండా పనులు చేస్తున్నారు. పనులు చేయకుండానే నిధులు దోచుకుంటున్నారు. అధికారులు ఆదేశించినా.. పట్టించుకోవడం లేదు.

– సంగమేశ్వర్ , నీలకంఠపల్లి, విద్యార్థి తండ్రి

పనులు చేస్తేనే రికార్డులు చేస్తాం

పాఠశాలలో నాణ్యతతో పనులు చేస్తేనే రికార్డులు చేస్తాం. అడ్వాన్స్‌గా నిధులు డ్రా చేసుకున్నా.. పనులు చేయకపోతే నిధులు రికవరి చేస్తాం. ఇప్పటి వరకు రాంపూర్ పాఠశాలలో చేపట్టిన పనులకే రికార్డు చేశాం. అక్రమాలకు పాల్పడితే బిల్లులు నిలిపివేస్తాం.

– విజయ్‌గౌడ్,పీఆర్ ఏఈ విజయ్‌గౌడ్

రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



పెద్దశంకరంపేట(మెదక్): కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): రైతుల సమస్యలను ప్రభుత్వం తప్పకుండా పరిష్కరిస్తుందని, ఈ దిశగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చీలాపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులతో పాటు రైతు బీమా చెక్కును అందజేశారు. దీంతో పాటు చీలాపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో యాంటీ నార్కోటిక్ బ్యూరో పోస్టర్‌ను ఆవిష్కరించి, మత్తు పదార్థాల వల్లే కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గ్రేస్‌బాయి, పీఏసీఎస్ చైర్మన్ సిద్ద సంజీవరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మధు, నాయకులు నారాగౌడ్, ఆర్‌ఎన్.సంతోష్, సంగమేశ్వర్, జనార్దన్, సత్యనారాయణ, కుంట్ల రాములు, పెరుమాండ్లుగౌడ్, దేవేందర్, సీఈఓ రవీందర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

చల్మెడలో..

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో రామాయంపేట సొసైటీ చైర్మన్ చంద్రం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వరి ధాన్యాన్ని తేమ శాతం సరిగ్గా వచ్చేలా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తరలించాలన్నారు. ప్రైవేట్ వ్యాపారస్తులకు నమ్మి మోసపోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ బాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రమేశ్, ఆలయ కమిటీ చైర్మన్ రామ్‌రెడ్డి, సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో వెలుగు చూసిన అక్రమాలు



మాట్లాడుతున్న ఏపీడీ రంగాచారి

అల్లాదుర్గం(మెదక్): ఉపాధి హమీ పనుల్లో టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు కుమ్మక్కై, పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. వారం రోజులుగా మండలంలో సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నారు. మంగళవారం ప్రజాదర్బార్‌లో అక్రమాలను బయటపెట్టారు.

– అల్లాదుర్గం మండలంలో 1-04-2023 నుంచి 31-03-2024 వరకు 312 పనులు ఉపాధిహామీ పథకం కింద చేపట్టారు. కూలీల ఉపాధి పనులకు రూ.3 కోట్ల 23లక్షల 23 వేల100, మెటీరియల్ పనులకు రూ.35 లక్షల 47 వేల763 పనులు చేపట్టాక, ఈ నిధుల పనులపై సామాజిక తనిఖీ చేపట్టారు. ఉపాధిహామీ పనులు చేయించిన ఫీల్డ్‌అసిస్టెంట్లు, టీఏలు పలు అక్రమాలకు పాల్పడ్డారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు పనులు చేయకున్న బినామీ పేర్లపై రికార్డులు సృష్టించి డబ్బులు స్వాహా చేశారు. ఒక కుటుంబం పని చేయకున్నా.. పని చేసినట్లు రికార్డులు సృష్టించి రూ.29 వేలు స్వాహా చేశారు. 2021 చనిపోయిన వ్యక్తి ఐదు రోజులు పని చేసినట్లు మాస్టర్లు రాసి కూలి డబ్బు డ్రా చేసుకోవడం మరో విచిత్రం.

జరిమానా విధించాం

ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడిన వారి నుంచి రూ. 3 లక్షల 74 వేల 620 రికవరీకి ఆదేశించాం. మరో రూ.59100ల జరిమానా విధించామని ఏపీడీ రంగాచారి తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ రాజు, డీపీఓ శ్రీహరి, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ విజేత మెదక్

పాపన్నపేట(మెదక్): జిల్లా స్థాయి అండర్ 17 కబడ్డీ పోటీల్లో మెదక్ మండలం విజేతగా నిలిచింది. మంగళవారం పాపన్నపేటలో జరిగిన అండర్ 17 విభాగంలో మెదక్ జట్టు, అండర్ 14 విభాగంలో హవేలిఘనపురం మొదటి స్థానం, రెండో స్థానంలో అల్లాదుర్గం, నర్సాపూర్ నిలిచాయి. మొదటి రోజు జిల్లా నుంచి 20 మండలాల్లోని క్రీడాకారులు పాల్గొన్నారు. రెండో రోజైన బుధవారం బాలికలకు పోటీలు జరుగుతాయి. కార్యక్రమంలో దాతలు నితలాక్షప్ప, గౌస్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రమేశ్, పీఈటీ సంఘం అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, పీడీ రమేశ్, చంద్రమోహన్, రవి, మాదవ్‌రెడ్డి, మధుసూదన్, కిరణ్ కుమార్, శ్రీధర్ రెడ్డి, అశోక్, మహిపాల్, రాజేందర్, రూపేందర్ , క్రీడాకారులు పాల్గొన్నారు.

తరగతి గదిలో విద్యార్థులకు ప్రపంచం చూపాలి

డీఈఓ రాధాకిషన్



కొత్తపల్లి హెచ్‌ఎం సురేందర్ గౌడ్‌ను సన్మానిస్తున్న రాధాకిషన్

పాపన్నపేట(మెదక్): విద్యార్థికి జీవితాంతం గుర్తుండి పోయేవాడే నిజమైన గురువని మెదక్ రాధాకిషన్ అన్నారు. మంగళవారం పాపన్నపేట మండలం కొత్తపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సురేందర్‌గౌడ్, కొడుపాక స్కూల్ అసిస్టెంట్ రంగారెడ్డి పదవీ విరమణ సన్మానానికి హాజరై ప్రసంగించారు. టీచర్లు తరగతి గదిలో విద్యార్థికి ప్రపంచాన్ని చూపాలన్నారు. చిన్నప్పటి నుంచి విద్యార్థి గమ్యాన్ని నిర్దేశించుకునేలా తీర్చిదిద్దాలన్నారు. సురేందర్ గౌడ్ ఒక మంచి ప్రధానోపాధ్యాయుడిగా పని చేశారని చెప్పారు. రంగారెడ్డి జిల్లా కొడుపాక గ్రామానికి సమయానుకూలంగా వెళ్లి విద్యార్థులకు బోధనలు చేశారని చెప్పారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, డీఈఓలను సన్మానించారు. డైట్ ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు, ఎంఈఓలు నీలకంఠం పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ విఫలం

చిన్నశంకరంపేట(మెదక్): ధాన్యం కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని నార్సింగి సహకార సంఘం డైరెక్టర్ బిక్యా నాయక్ విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పంట చేతికొచ్చినప్పటికీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులకు దళారులకు అమ్ముకొని నష్టపోతున్నారన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ప్రభుత్వం కొనుగోలు ఎందుకు చేయడం లేదన్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు ప్రారంభించాలన్నారు.

నేడు బీసీ కమిషన్ సమావేశం

మెదక్ కలెక్టరేట్: బీసీ కమిషన్ ఉమ్మడి మెదక్ జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం సంగారెడ్డిలో ప్రత్యేక సమావేశం ఉంటుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ మంగళవారం తెలిపారు. కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, సురేందర్, బాలలక్ష్మి, బీసీ వెల్ఫేర్ కమిషనర్‌తో కూడిన బృందం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు సంగారెడ్డిలో ప్రజాభిప్రాయాలు సేకరిస్తుందన్నారు. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల బీసీ సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలు తెలియజేయవచ్చునని తెలిపారు.

ట్రిపుల్‌ఆర్ భూముల్లో మట్టి తవ్వకాలు

- రాత్రి వేళ టిప్పర్ల ద్వారా రవాణా



గుండ్లపల్లిలో గుర్తించిన ట్రిపుల్‌ఆర్ భూముల్లో ఎర్ర మట్టి తవ్వకాలు

శివ్వంపేట(నర్సాపూర్): మట్టి వ్యాపారులు ఎలాంటి అనుమతులు లేకుండా ట్రిపుల్‌ఆర్ రోడ్డు కోసం గుర్తించిన భూముల నుంచి మట్టి తవ్వకాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండల పరిధిలోని గుండ్లపల్లి, పోతులబోగూడ గ్రామాల్లో గుర్తించి ట్రిపుల్‌ఆర్ రోడ్డు భూముల్లో జేసీబీలతో ఎర్రమట్టి తవ్వకాలు చేస్తూ టిప్పర్ల ద్వారా వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. వారం రోజుల నుంచి రాత్రి 9 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు మట్టి రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. సంబంధిత అధికారుల నిర్లక్ష్య వైఖరితో వీరి వ్యాపారం ఎలాంటి ఆటంకం లేకుండా జరుగుతోంది. పట్టాదారునికి ఎంతో కొంత డబ్బులు ముట్టజెప్పి ఎర్రమట్టిని తరలిస్తున్నారు. అధిక లోడ్‌తో గ్రామీణ రోడ్ల గుండా మట్టి టిప్పర్లు వెళ్తుండడంతో రోడ్లు పాడైపోతున్నాయని గ్రామస్తులు వాపోయారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయం గురించి ఉప తహసీల్దార్ షఫీయోద్దీన్‌ను వివరగా కోరగా.. గుండ్లపల్లి, పోతులబోగూడ గ్రామాల్లో నుంచి మట్టి తవ్వకాలు జరుగుతున్న విషయం మా దృష్టికి రాలేదని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

రాజిపేట పాఠశాలలో దీపావళి సంబరాలు



పాఠశాలలో ముందస్తు దీపావళి సంబరాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు



నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మట్టి ప్రమిదలను వెలిగిస్తున్న అధ్యాపకులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాజిపేట ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు దీపావళి పండుగను మంగళవారం హెచ్‌ఎం కిషోర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దీపావళి పండుగ ప్రాముఖ్యతను వివరించారు. అనతంరం దీపాలు వెలిగించారు. విద్యార్థులు పండుగ సందర్భంగా ఇంటివద్ద బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సౌజన్య, కీర్తి, భవాణి, వీవీ అఖిల, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నర్సాపూర్ రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. మంగళవారం కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, ఏకో క్లబ్, మహిళా సాధికారిక విభాగం ఆధ్వర్యంలో ముందస్తు దీపావళి వేలుకలు నిర్వహించారు. విద్యార్థినులు స్వయంగా మట్టితో తయారుచేసిన ప్రమిదల్లో దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. కాలుష్య రహిత టపాకాయలు, దీపాలు వెలిగించి పండుగ జరుపుకోవాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సురేష్ కుమార్ ప్రసంగించారు. ఈ వేడుకలో అధ్యాపకులు సమీరా, శ్రీనివాస్, సౌజన్య, రుక్మిణి, అనిత, రమేష్, ఆరిఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన ఒకరోజు టాలీ వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రిన్సిపాల్, ఆయా సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు

మెదక్ కలెక్టరేట్: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాప్ విజయవంతమైందని ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి టాలీ ప్రైవేట్ లిమిటెడ్ ఎడ్యుకేషన్ సంస్థ అసిస్టెంట్ రీజనల్ మేనేజర్ మల్లేశ్వరం గుప్తా టాలీ సాఫ్ట్‌వేర్‌పై విద్యార్థులకు వివరించారు. నేటి మార్కెట్‌లో ఈ సాఫ్ట్‌వేర్‌ను వ్యాపార సంస్థలు ఏ విధంగా నిర్వహిస్తున్నాయో, వాటి ప్రాముఖ్యతని వివరించారు. తెలంగాణ విశ్వవిద్యాలయం అధ్యాపకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులకు టాలీ సబ్జెక్టులో నైపుణ్యాలను సాధిస్తే కలిగే ఉద్యోగ అవకాశాలను వివరించారు. వాణిజ్య శాస్త్రం శాఖధిపతి డాక్టర్ శరత్‌రెడ్డి మాట్లాడుతూ.. కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగం టాలీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో తమ విభాగం నిర్వహిస్తున్న టాలీ సర్టిఫికెట్ కోర్సుకు తాను డైరెక్టరుగా, సమన్వయకర్తగా శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డా.తిరుమలరెడ్డి, డా.చంద్రశేఖర్, హరిత, నిదర్శిని, రఫిక్, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

నిధులు లేక ఇబ్బందులు పడుతున్నాం



వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యర్శులు

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామ పంచాయతీల్లో నిధులు లేక అభివృద్ధి పనులు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నామని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎంపీఓ తిరుపతిరెడ్డికి, సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ.. జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నాలుగేళ్లు పూర్తి చేసుకున్న వారిని గ్రేడ్ 4 పంచాయతీ కార్యదర్శులుగా క్రమబద్ధీకరించాలన్నారు. 18 నెలలుగా రాష్ట్ర, కేంద్ర ఆర్థిక సంఘాల నిధులు రావడంలేదన్నారు. దీంతో సొంత నిధులతో గ్రామాల్లో పనులు చేయాల్సి వస్తుందని అప్పులు చేస్తూ తీవ్రమైన మానసిక ఆందోళనతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మండల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

తుంపర సేద్యం సద్వినియోగం చేసుకోండి



రైతులతో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి ప్రతాప్ సింగ్

పాపన్నపేట(మెదక్): తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించేలా తుంపర సేద్యం సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గాంధారిపల్లిలో పర్యటించి రైతులతో కలిసి ఆయన మాట్లాడారు. జిల్లాలో 335 తుంపర సేద్యం యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. అవసరమైన వారు ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, ఉల్లిగడ్డ తక్కువ నీటితో పండించవచ్చన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఆలయ నిర్మాణానికి విద్యుత్‌లైన్ ఏర్పాటు**

నిజాంపేట(మెదక్): అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సహకారంతో విద్యుత్‌లైన్ ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకుడు మహేందర్ తెలిపారు. మండల కేంద్రంలో అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి, విద్యుత్ లైన్ ఏర్పాటుకు సహరించిన ఎమ్మెల్యే రోహిత్‌రావుకు కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

◆ **ఆస్పత్రిలో ఆయుర్వేదిక్ డే**

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లి పీహెచ్‌సీలో జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆయుర్వేదిక్ డేను నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆయుర్వేదిక్ డే సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ సందేశాన్ని ట్యాబ్‌లో సిబ్బందికి వినింపిచారు. అలోపతి వైద్యంతో పాటు ఆయుర్వేదిక్ వైద్యం ప్రాముఖ్యతను వివరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు శ్రీధర్ రెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

◆ **దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు**

శివ్వంపేట(నర్సాపూర్): పాతకక్షలు దృష్టిలో పెట్టుకొని వ్యక్తిపై దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కొంతన్‌పల్లి గ్రామానికి చెందిన పెంటం యాదగిరిపై అన్న కొడుకు నాగరాజు అతని స్నేహితుడు సాయికుమార్ పాతకక్షలు దృష్టిలో పెట్టుకొని సోమవారం రాత్రి చంపడానికి కత్తితో మెడపై దాడికి పాల్పడ్డారు. గుర్తించిన యాదగిరి కొడుకు ఇసాక్ అడ్డురావడంతో అతనిపై కూడా దాడికి పాల్పడ్డారు. చుట్టుపక్కల వారు రావడంతో తండ్రి, కొడుకులను కాపాడారు. బాధితుడి ఫిర్యాదుతో నాగరాజు, సాయికుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

◆ **తపస్ మండల అధ్యక్షుడిగా ప్రభాకర్**

కౌడిపల్లి(నర్సాపూర్): టీపీయూఎస్ (తపస్) మండలాధ్యక్షుడిగా ప్రభాకర్ ఏక్రగీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం మండల టీపీయూఎస్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా స్వామి, ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్, కోషాధికారిగా చంద్రశేఖర్, కార్యదర్శులుగా కృష్ణంరాజు, శ్రీకాంత్, రమేష్, కార్యవర్గ సభ్యులుగా నరేందర్‌రెడ్డి, సంతోష్, వేణుగోపాల్, విఠల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు చెప్పారు. ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన మండలాధ్యక్షుడు తెలిపారు.

◆ **ఉచిత కరెంట్‌కు బిల్లు**

మెదక్‌జోన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం రజకులకు నెలకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ఇచ్చిందని, ఆ బిల్లును ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ అధికారులు కట్టమంటున్నారని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి మాజీ మంత్రి హరీశ్‌రావుకు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రజకులు దుస్తులు ఇస్త్రీ చేయటానికి, దోబీ గాట్ల నిర్వాహణ కోసం విద్యుత్‌ను ఉపయోగిస్తారని, రెక్కాడితే గానీ డొక్కాడని రజకుల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం నెలకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ఇచ్చారన్నారు. ఈ విషయంపై మాజీ మంత్రి హరీశ్‌రావు సానుకూలంగా స్పందించారని చెప్పారన్నారు. హరీశ్‌రావును కలిసిన వారిలో మెదక్ జిల్లా బీఆర్‌ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఉన్నారు.

◆ **అంగరంగా వైభవంగా అంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం**

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం అంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాలు భక్తి శ్రద్ధలతో వైభవంగా జరుపుకొన్నారు. అంజనేయ స్వామికి యజ్ఞం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేసి, అన్నదానం చేశారు.

◆ **క్షీరాభిషేకం**

మెదక్ మున్సిపాలిటీ: బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనను విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) తిరస్కరించినందుకు, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుతో సంబరాలు చేస్తున్నట్లు తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జగపతి, పట్టణ పార్టీ కన్వీనర్ ఆంజనేయులు, పట్టణ పార్టీ కోకన్వీనర్‌లు కృష్ణాగౌడ్, సాయిలు, మున్సిపల్ కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, కిశోర్, సుంకయ్య తదితరులు పాల్గొన్నారు.